క్లుప్తంగా

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నరసన్నపేట: లయన్స్ క్లబ్ నరసన్నపేట ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి కోసం నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించగా.. 145 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ చిత్రలేఖన పోటీలు 197 దేశాల్లో లయన్స్ క్లబ్ నిర్వహిస్తోందని, జిల్లాలో మొదటి స్థానం పొందిన విద్యార్థికి మాల్దీవుల్లో నిర్వహించే ఫైనల్ పోటీలకు పంపుతామని క్లబ్ కార్యదర్శి పి.రమేష్ తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తంగుడు రత్నకుమార్, ట్రెజరర్ రమేష్, జోనల్ చైర్మన్ రమణ సాహు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తపాలా దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న పోస్ట్ మాస్టర్ వెంకటేష్

పాతపట్నం: ప్రజలకు నిరంతర సేవలను అందిస్తున్న అతి పెద్ద సేవా రంగం తపాలా వ్యవస్థ అని పాతపట్నం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ జె.వెంకటేష్ అన్నారు. గురువారం అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పోస్ట్ ఆఫీసును సందర్శించారు. ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ వెంకటేష్ మాట్లాడుతూ.. తంతి తపాలా సేవలే కాకుండా, పొదుపు పథకాలు, ఏటీఎం సేవలు, జీవిత బీమా పథకాలు, ఆధార్ సేవలు, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు నగదు పంపిణీ తదితర సేవలు అందిస్తున్నామన్నారు. హెచ్ఎంఎస్ వైకుంఠరావు, సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్.టి.రామారావు, ఉపాధ్యాయులు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది

బూర్జ: మండలంలోని అల్లెన గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయశాఖ ఏడీ బి.రాజగోపాలరావు, తదితరులు గురువారం పరిశీలించారు. ఏఓడీ ఉషారాణి ఆధ్వర్యంలో పరిశీలించి వ్యవసాయ రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. పంట నష్టాలను గుర్తించి నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన

పాతపట్నం: భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని కొరసవాడ గ్రామంలో టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భూముల రీ సర్వేపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. రైతుల సమక్షంలోనే భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ హెచ్.వి.రమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.రవివర్మ, సైలాడ సతీష్, సర్పంచ్‌లు జక్కర ఉమ, నల్లి జగదీశ్వరరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామంలో గల మహాత్మా జ్యోతిరావ్ పూలే బాలికల పాఠశాలను టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలోని ఎంత మంది విద్యార్థినులు ఉంటున్నారు, భోజన సదుపాయాలు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల రికార్డులను, భోజన గదిని, వంట పాత్రలు, వంట గది పరిసరాలను పరిశీలించారు. ఎమైనా ఇబ్బందులున్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దు

కొత్తూరు: అత్యధిక మార్కులు సాధించాలని విద్యార్థులపై తల్లిదండ్రులు ఎక్కువగా ఒత్తిడి తీసుకురావొద్దని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.తిరుమలరావు అన్నారు. మండలంలోని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మానసిక ఆరోగ్యం సాధనపై విద్యార్థులకు జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ అంపిలి ప్రశాంత్ అవగాహన కల్పించారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. రోగాలు రావా?



పెదవెంకటాపురంలో రహదారిలో నిల్వ ఉన్న మురుగునీరు

- రహదారులపై మురుగునీరు నిల్వ
- వృద్ధి చెందుతున్న దోమలు, ఈగలు
- ప్రబలుతున్న అంటువ్యాధులు

సరుబుజ్జిలి: వర్షాలు కురవడంతో వాతావరణం కలుషితమైన పలురకాల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముంది. పరిసరాల పరిశుభ్రం విషయంలో ఏమాత్రం ఏమరపాటు వహించినా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు. వైద్యారోగ్యశాఖ అధికారులు పలుమార్లు హెచ్చరిస్తున్నా స్థానికంగా జాగ్రత్తలు తీసుకకపోవడం వలన పలురకాల వ్యాధులకు ప్రజలు గురవుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస రూరల్, పట్టణం, బూర్జ మండలాల్లో వర్షాలు కురవడం వలన ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ చేరింది. దోమలు వృద్ధి చెందడంతో చికిన్ గున్యా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి.



నందికొండ కాలనీలోని రహదారిపై చేరిన మురుగునీరు

పాటించాల్సిన జాగ్రత్తలు.....

- ఆవాసాలు ముందరు చెత్త, పెంట కుప్పలు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి.
- కొబ్బరి బొండాల చిప్పలు, పాతటైర్లు, పూలకుండీలు లేకుండా చూడాలి.
- భోజనం ముందు, మలమూత్ర విసర్జన సమయాల్లో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలి.
- కలుషిత నీటికి, ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
- వేడి పదార్థాలను తీసుకోవాలి, కాచిచల్లార్చిన నీటిని తాగాలి.

దుర్వాసన..



రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని దేవాంగుల కొత్త వీధి నుంచి చాకలి వీధికి వెళ్లే రహదారిపై మురుగునీటితో అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం కురిస్తే బురదమయంగా మారుతోంది. వర్షం నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తరచూ అంటువ్యాధులు



పారిశుద్ధ్యం విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. మురగు కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేశారు. దీని వలన మురగునీరు రోడ్లపై నిల్వ చేరి దోమలు, ఈగలు పెరుగుతున్నాయి. దీంతో తరచూ అంటువ్యాధులు ప్రబలుతున్నాయి.

– ఇల్లాకులు శ్రీనివాసరావు, నందికొండ కాలనీ, సరుబుజ్జిలి మండలం

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



వర్షా కాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా జ్వరం వస్తే ప్లేట్‌లెట్ లెవల్స్ తగ్గడం వలన ఆందోళనకు గురవుతున్నాం. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

– పైడి మోహనరావు, మతలబుపేట, సరుబుజ్జిలి మండలం

జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాలు కురిసిన వెంటనే వాతావరణంలో మార్పులు వచ్చి అంటువ్యాధులు ప్రబలుతాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్, క్లోరినేషన్ పనులు చేస్తున్నాం. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– బమ్మిడి జ్యోతిర్మయి, వైద్యాధికారి, పురుషోత్తపురం పీహెచ్‌సీ

బోధనేతర పనులు చేయబోం

- ఎంఈఓకు వినతిపత్రం అందించిన ఫ్యాప్టో నాయకులు



నరసన్నపేట: ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు



పాతపట్నం: వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన ఉపాధ్యాయులకు బోధనా సమయం హరించుకుపోతుందని, ఈ నెల 10వ తేదీ నుంచి ఒక్క మధ్యాహ్న భోజనం యాప్ తప్ప.. మిగిలిన అన్ని యాప్‌లను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో సంఘం మండల నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక ఎంఈఓ యు.శాంతారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో నాయకులు బి.కేశవరావు, నడిమింటి అప్పలనాయుడు, గంగు చంద్రశేఖర్, పీస నరసింహమూర్తి మాట్లాడుతూ.. బోధనేతర కార్యక్రమాలను తగ్గించి, ఉపాధ్యాయులు పాఠాలు చెప్పేలా చూడాలని అనేక విజ్ఞప్తులు చేశామన్నారు. ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని, దీంతో ఈ చర్యకు దిగాల్సి వచ్చిందన్నారు. 10వ తేదీ నుంచి కేవలం బోధనకే పరిమితమై విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు.

బోధనేతర యాప్‌లను బహిష్కరిస్తాం..

పాతపట్నం: బోధనేతర పనులకు సంబంధించిన యాప్‌లను ఈ నెల 10 వ తేదీ నుంచి బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో మండల నాయకులు ఎస్.వైకుంఠరావు, పి.వల్లభరావు, ఎం.రామారావు అన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఎం.వెంకటరమణ, జి.కవీశ్వరరావు, పి.రవింద్ర, బి.చిన్నబాబు, ఎం.శంకరరావు, ఎ.దాలయ్య, ఎస్.పార్వతమ్మ, జె.జయమ్మ, ఎం.కుసుమకుమారి, వై.జోగారావు, ఎస్.శ్రీనివాసరావు, హెచ్.దుర్గారావు, ఎ.గోపాలరావు, ఎ.సుదర్శనరావు, బాలకృష్ణ, ఎ.అప్పలస్వామి పాల్గొన్నారు.

గులుమూరు విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం దాలయ్య, పీడీ సుజాత

హిరమండలం: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గులుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రస్తుతం ఈ పోటీలు శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో జరుగుతున్నాయి. అండర్ 14, 17, 10 విభాగాల్లో వివిధ క్రీడాంశాల్లో రావాడ గౌతమ్, వంజరాపు వసంత్‌కుమార్, పొన్నాన శ్రీకాంత్, గొద్దు పద్మజ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను, పీడీ సుజాతను ఎంఈఓ రాంబాబు, ఎంఈఓ–2, హెచ్ఎం దాలయ్య అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పోలాకి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిల్ ఇంజినీర్ గ్రూపులో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత గ్రూపులో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ కలిగి వుండి, 50 శాతం మార్కులు పైబడి వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 14వ తేదీ సాయంత్రంలోగా ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాలలో అందజేయాలన్నారు. 15వ తేదీన అర్హత ఆధారంగా ఉదయం 11 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయండి

సారవకోట: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సింహాచలం సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధి, పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు గూర్చి వివరించారు. మండల పరిషత్ కార్యనిర్వాహక అధికారి ఎస్.వి.రమణ ఉన్నారు.

యాంత్రీకరణతో మేలు

హిరమండలం: ఆధునిక వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి ఎం.మంగమ్మ సూచించారు. గురువారం చొర్లంగిలో ఉద్యానవనశాఖకు సంబంధించి ఆయిల్‌పామ్ సాగు, వ్యవసాయ పరికరాలు, యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవన పంటల సాగులో సరైన నీటి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. స్ప్రింక్లర్లు అమర్చితే పంట మొత్తానికి తడులు అందుతాయన్నారు. ఏఓ సంధ్య, ఉద్యానవన, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..!



ఉచిత బస్సు లేకపోవడంతో ఆటోలో వెళ్తున్న మహిళలు

- గ్రామీణ మహిళలకు అందని స్త్రీ శక్తి పథకం ప్రయోజనం
- బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని విన్నవిస్తున్న ప్రజలు

కొత్తూరు: కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించిన స్త్రీశక్తి పథకం (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలకు అంతగా ప్రయోజనం ఉండడం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు పలు రకాల పనులపై వచ్చే వారికి బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఆటోలు, ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారాయి. గతంలో కొత్తూరు మండల కేంద్రం నుంచి కడుము, అంగూరు, పతికవలస, గొట్టిపల్లి, ఏ.ఎస్.కవిటి, దిమిలి, పాతపట్నం, హిరమండలం మండలంలోని గులుమూరు–నివగాం, తురకపేట నుంచి దబ్బపాడు మీదుగా ఎల్.ఎన్.పేట, జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం, పాతపట్నం నుంచి బైదిలాపురం, రొంపివలసతోపాటు పలు గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిచేవి. ఆదాయం రావడం లేదనే పేరుతో ఆర్టీసీ అధికారులు సర్వీసులను రద్దు చేశారు. పల్లె వెలుగు బస్సులను పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వాన్ని మహిళలు కోరుతున్నారు.

ఉపయోగం లేదు



ఉచిత బస్సు పథకం వల్ల ఉపయోగం లేదు. కొత్తూరు రావాలంటే ఆర్టీసీ బస్సులు లేవు. ఆటోల్లోనే వస్తున్నాం. గతంలో మా గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చేది. ఇప్పుడు రావడం లేదు. గతంలో వచ్చిన బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించి, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

– సవర పార్వతి, దాపాకులుగూడ, కొత్తూరు మండలం

గిరిజన గ్రామాలకు బస్సులు లేవు..



గిరిజన గ్రామాలకు బస్సులు లేకపోవడంతో స్త్రీ శక్తి పథకం ఉపయోగపడడం లేదు. గిరిజన గ్రామాల నుంచి మండల కేంద్రం వరకు ఆటోల్లో వస్తున్నాం. గతంలో గిరిజన గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వచ్చేవి. ప్రస్తుతం బస్సు సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు మరింత ఇబ్బంది పడుతున్నారు.

– గేదెల రమణమ్మ, గొట్టిపల్లి, కొత్తూరు మండలం

వైఎస్ జగన్ పర్యటనకు బయలుదేరిన పార్టీ నాయకులు



వైఎస్సార్‌సీపీ శ్రేణుల అడ్డగింత

- కొంత సమయం తరువాత విడిచిపెట్టిన పోలీసులు
- పోలీసుల తీరుపై నాయకుల మండిపాటు



మడపాం టోల్ గేట్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకొని మాట్లాడుతున్న నరసన్నపేట సీఐ, ఎస్ఐ

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహనరెడ్డి నర్సీపట్నం మండలం బీమబోయినపాలెం వద్ద మెడికల్ కళాశాల సందర్శనకు వచ్చిన నేపథ్యంలో నరసన్నపేట నుంచి బయలుదేరిన పార్టీ శ్రేణులను మడపాం టోల్ గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పార్టీ నాయకులు రాజాపు అప్పన్న, చింతు రామారావు, దండి జయప్రకాశ్, సురంగి నర్సింగరావు, కనపల శేఖరరావు, తదితరులు నాలుగు కార్లతో వెళ్తుండగా సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గప్రసాద్ అడ్డుకున్నారు. నర్సీపట్నం వెళ్లొద్దని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తవచ్చని సూచిస్తూ నిలువరించారు. కొద్ది సమయం అడ్డుకున్న తరువాత అందరూ ఒక్కసారి కాకుండా వేర్వేరుగా వెళ్లాలని సూచిస్తూ విడిచిపెట్టారు. పోలీసులు ఈ విధంగా అడ్డుకోవడాన్ని పార్టీ నాయకులు తప్పుబట్టారు. ఎక్కడా లేని ఆంక్షలు నరసన్నపేట పోలీసులకే వచ్చాయా అని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ పర్యటనకు నరసన్నపేట నుంచి పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, ఉకలాపు రవి, నేతింటి రాజేశ్వరరావు, బుద్దల రాజశేఖర్, సతివాడ రామినాయుడు, కణితి కృష్ణారావు, చింతు రాఘవ, కోటిపల్లి శ్రీనివాస్, తదితరులు తరలివెళ్లారు.

ఈకేవైసీ తప్పనిసరి



పొందూరులో జరుగుతున్న ఈకేవైసీని పరిశీలిస్తున్న పీడీ సుధాకరరావు

పొందూరు: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జరుగనున్న పనులకు సంబంధించి వేతనదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే పేమెంట్స్ జనరేట్ అప్‌లోడ్ చేయడంతో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. గ్రామాల్లో శ్రామికులంతా తప్పనిసరిగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు చేపడుతున్న ఈకేవైసీకి సహకరించాలని కోరారు. ఏపీఓ పి.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సహాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా

- శిక్షణకు సమాచారం ఇవ్వకపోతే ఎలా?
- మండల స్థాయి అధికారుల తీరుసరికాదు
- జోనంకి సర్పంచ్ రమణి



జలుమూరు: మండల కేంద్రంలో నిర్వహించిన సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమానికి తనకు సమాచారం ఇవ్వలేదని జోనంకి సర్పంచ్ జి.వి.రమణి అన్నారు. ఈ విషయమై గురువారం జోనంకిలో విలేకర్లతో మాట్లాడారు. రెండు రోజులపాటు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరుగుతుండగా మహిళా సర్పంచ్ అయిన తనకు కార్యాలయ అధికారులు, సంబంధిత పంచాయతీ కార్యదర్శి సమాచారం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. తాను వైఎస్సార్‌సీపీ అభిమానిని అని అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై డీపీఓతోపాటు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ విషయంపై పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రెండు రోజుల శిక్షణకు అందరు సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. జోనంకి సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకపోవడం తప్పేనని, ఇక నుంచి అలా జరగకుండా చూస్తామని తెలిపారు. సర్పంచ్‌ల శిక్షణపై జోనంకి సర్పంచ్ జి.వి.రమణికి సమాచారం ఇచ్చానని కార్యదర్శి సరోజిని తెలిపారు.

ఆకట్టుకున్న వేషధారణలు



ఆమదాలవలస: వివిధ వేషధారణలు



సరుబుజ్జిలి: పగటివేషధారణలతో ఆకట్టుకున్న గ్రామస్తులు

ఆమదాలవలస/ సరుబుజ్జిలి: ఆమదాలవలస పట్టణంలోని పాతినవారివీధి, సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామంలో నిర్వహిస్తున్న గౌరమ్మ, నందన్న ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం స్థానికులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. డప్పుల దరువులతో సందడి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విచారణ..



నివగాంలో విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ రమణ



మెట్టూరుబిట్–1 ఆర్ఆర్ కాలనీలో విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ

కొత్తూరు: మండలంలోని నివగాం, మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీ సర్పంచ్‌లు (టీడీపీ నాయకులు) మీసాల వనిత, అడపాక శంకరరావు ఆయా పంచాయతీల్లోని నిధులను దుర్వినియోగం చేశారని అందిన ఫిర్యాదుల మేరకు టెక్కలి డీఎల్‌పీఓ ఇప్పిలి వెంకటరమణ గురువారం ఆయా పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల్లో వేర్వేరుగా విచారణ చేపట్టారు. నివగాం పంచాయతీలో రూ.30 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు గ్రామానికి చెందిన బి.కమలహాసన్ ఫిర్యాదు చేశారు. ఇందులో రూ.15 లక్షలను వార్డు మెంబర్ (టీడీపీ కార్యకర్త) నూలు వీరభద్రస్వామి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీలో రూ.15 లక్షలను దుర్వినియోగం చేసినట్లు పంచాయతీకి చెందిన ఎస్.బాలరాజు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు డీఎల్‌పీఓ అన్ని రికార్డులనూ పరిశీలించారు. ఫిర్యాదుదారుల వద్ద వివరాలు సేకరించారు. 15 రోజుల్లో తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.